క్లుప్తంగా

రైతులతో బ్యాంక్‌లు కిటకిట


హద్నూర్‌లోని కెనరా బ్యాంక్‌లో రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యాల్‌కల్, చాల్కి, హద్నూర్, కొత్తూర్(బి)లోని ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, కెనరా బ్యాంక్‌లు బుధవారం రైతులతో కిటకిటలాడాయి. రుణ మాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి రైతులు బ్యాంక్‌ల నుంచి బ్యాంక్ స్టేట్‌మెంట్ తేవాలని అధికారులు చెప్పడంతో రైతులు ఉదయం నుంచి బ్యాంక్‌కు బారులు తీరారు. రైతులు పెద్ద ఎత్తున బ్యాంక్‌లకు తరలి రావడంతో కిటకిటలాడాయి.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు


మఠంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్న హైదరాబాద్‌లోగల ఆలయ మఠంలో పూజలు, అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు జరిపారు. మహా నైవేద్యం, మహామంగళ హారతి, తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఉడిపి పీఠాధిపతులు శ్రీనిధి అచార్‌లు రాఘవేంద్రస్వామి చరిత్ర గురించి వివరించారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు మఠంను సందర్శించి మహోత్సవాల్లో తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ మేరకు జీఓ 28 ప్రతులను 23న మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డి కలెక్టరెట్ వద్ద దహనం చేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలొచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.

ఉర్దూ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జమీరొద్దీన్

జహీరాబాద్ టౌన్: ఉర్దూ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సయ్యద్ జమీరొద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూడబ్ల్యూజేయూ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కరీం, రాష్ట్ర కార్యదర్శి షేక్ అయూబ్, నాయకులు సుజావుద్దీన్, వసీం ఘోరీ, రోషన్, నయిం, నవీద్, ముబీన్, రుద్రయ్యస్వామి, మహేష్‌లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ అన్నారు. అలా కాకుండా ఇష్టారాజ్యంగా ఇల్లు కడితే కఠిన చర్యలు తప్పవ న్నారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రేశంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న 7 భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు జారీ చేసిన వినకుండా ఇష్టారాజంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్ : రైతు సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడే ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీకి ఎటువంటి నిబంధనలు లేకుండా రైతులందరికీ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు మొగులయ్య, లక్ష్మీకాంతరెడ్డి, మల్లేశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పంటలు

- సాగుకు సరిపడా వర్షం
- ఆనందంలో రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలోని కొన్ని ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల్లో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ముఖ్యంగా న్యాల్‌కల్ మండలం పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో సాగు 6.96 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు పడటంతో రైతులు విత్తుకున్నారు. 3,50,206 ఎకరాల్లో పత్తి, 79,502 ఎకరాల్లో కంది, 1,31,385 లక్షల ఎకరాల్లో వరి, 68,434 ఎకరాల్లో సోయా, 14,203 ఎకరాల్లో పెసర, 10,540 ఎకరాల్లో మొక్కజొన్న, 14,572 ఎకరాల్లో చెరకు, 8,031 ఎకరాల్లో మినుము పంటలను సాగు చేశారు. మిగతా 19,127 ఎకరాల విస్తీర్ణంలో ఇతర పంటలను సాగు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈసారి పత్తి సాగుతో పాటు మొక్కజొన్న, కంది, చెరకు తదితర పంటల సాగు విస్తీర్ణం సైతం పెరిగింది. ఈ ఏడాది జూన్ ఆరంభం నుంచే వేసుకున్నారు. ప్రారంభంలో కొద్ది పాటి వర్షాలు పడ్డాయి. ఆ తర్వాత జిల్లాలో సగటు వర్షపాతం కంటే అధిక వర్ష పాతం నమోదైంది. జూన్‌లో 120 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా 139.7 మిల్లీ మీటర్ల పాతం నమోదైంది. అలాగే జూలైలో 194 మి.మీ గాను 187.7 మి.మీ నమోదైంది. ఆగస్టులో 190 ఎంఎంకు గాను (20వ తేదీ వరకు) 109 మి.మీ కురిసింది. జూలై మాసంలో కొంత తక్కువ వర్ష పాతం నమోదు కావడంతో పాలు మండలాల్లో పంటలు కొంత మేర దెబ్బతిన్నాయి. న్యాల్‌కల్ మండలంలో సుమారు 40 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇతర ప్రాంతాల్లో పోలిస్తే ఈ మండలంలో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇక్కడ సాగుకు సరిపడా వర్షం కురిసినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పెసర పంట చేతికి వస్తుండగా మిగతా పంటలు పూత, కాత దశలో ఉన్నాయి.


మిర్జాపూర్(ఎన్)గ్రామ శివారులో సాగులో ఉన్న పత్తి పంట


చేతికి వచ్చిన పెసర పంట

పంటలు బాగున్నాయి



నేను 20 ఎకరాల్లో పత్తి, 7 ఎకరాల్లో చెరకు పంట సాగు చేపట్టాను. పత్తి, చెరకు పంటలు బాగున్నాయి. నాలుగేళ్లుగా పంటలు ఇలా ఉండగా చూడలేదు. పంటలకు సరిపడా వర్షం పడుతోంది.

– రాజప్ప, రైతు, చాల్కి గ్రామం

అధిక దిగుబడులు వస్తాయి

జిల్లాలోని 6.96 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఆశాజనకంగా ఉన్నాయి. చీడపీడలు సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగబడులు వస్తాయి.

– నర్సింహరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి

విషపూరిత జలాలను వదలొద్దు

- పీసీబీ కార్యాలయం ఎదుట కిష్టాయపల్లి వాసుల ధర్నా

పటాన్‌చెరు టౌన్: రసాయన పరిశ్రమల నుంచి వెలువడిన విషపూరిత రసాయనాలు కలిసిన నీటిని తాగడం వల్ల గేదెలు మృత్యువాత పడుతున్నాయని జిన్నారం మండలం కిష్టాయపల్లి గ్రామస్తులు సనత్ నగర్‌లోని పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మృతి చెందిన రెండు గేదెలతో పీసీబీ కార్యాలయ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డిపోతారం గ్రామపంచాయతీ పరిధిలో గల రసాయన పరిశ్రమల నుంచి వెలువడిన విషపూరిత రసాయన వ్యర్థ జలాలు బయటకు వదలడంతో స్థానిక అయ్యమ్మ చెరువులోకి చేరి నీరు కలుషితమవుతున్నాయి. అక్కడి నుంచి కిష్టాయ్యపల్లి మల్లెల చెరువులోకి రావడం వల్ల ఆ నీరు కూడా విషపూరితంగా మారుతున్నాయని ఆయా ప్రాంతవాసులు ఆరోపించారు. ఇదిలా ఉండగా కిష్టాయపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకున్న గేదెలతోనే జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలోనే మేత కోసం వెళ్లిన గేదెలు విషపూరితంగా మారిన ఆ నీటిని తాగి రెండు మూడు రోజుల వ్యవధిలోనే 10 గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయన్నారు. మరో నాలుగు గేదెల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందన్నారు. మృతి చెందిన గేదెల విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. రసాయన పరిశ్రమల నుంచి వచ్చిన కాలుష్య నీటి వల్ల తన ఉపాధి కోల్పోవడం జరిగిందని, దయచేసి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విషపూరిత జలాలు మళ్లీ రాకుండా కట్టడి చేయాలని పీసీబీ అధికారులను కోరారు. ఈ ధర్నాలో కిష్టాయపల్లి మాజీ సర్పంచ్‌లు ప్రకాష్ చారి, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యులు భాశెట్టిగారి రాజు, పెంటేష్, కుమార్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.


పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన జిన్నారం మండలం కిష్టాయపల్లి గ్రామస్తులు

పోలీస్ స్టేషన్లకు రంగులు


రంగులు వేసిన జిల్లా పోలీసు కార్యాలయం

సంగారెడ్డి జోన్: జిల్లాలోని పోలీస్ స్టేషన్ భవనాలకు మరమ్మతులు చేపట్టి కొత్తగా రంగులు వేయిస్తున్నామని ఎస్పీ రూపేశ్ బుధవారం వెల్లడించారు. జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యవసాయ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు బసంత్‌పూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకొని ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్‌లోని పరీక్షా కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. ఉత్తీర్ణత ఆధారంగా స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఫోన్ నెంబర్ 98495 35756 కాల్ చేయాలని ఆయన తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: హజ్ యాత్ర కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జహీరాబాద్ హజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గౌసొద్దీన్ తెలిపారు. దరఖాస్తులు వచ్చే నెల 9 వరకు అందజేయాలన్నారు. యాత్రికుల పాస్‌పోర్టు జనవరి 2026 వరకు చెల్లుబాటులో ఉండాలన్నారు. పూర్తి సమాచారం కోసం పట్టణంలోని మెహందీ కాంప్లెక్స్ ఉన్న హజ్ సొసైటీని సందర్శించాలని చెప్పారు.

గృహజ్యోతికి దరఖాస్తు చేయండి

నారాయణఖేడ్: గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకొని ఉండి ఇప్పటివరకు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందని వినియోగదారులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హులై ఉండి మీటర్ నెంబర్ రాయని వారు, తప్పుగా నమోదు చేసిన వారికి మరొకసారి అవకాశం కల్పించినట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత ఫారంలో దరఖాస్తుదారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన రశీదులను సమర్పించాలని కోరారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో పురాతన ఆలయాల జీర్ణోద్ధారణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో కల్యాణ సీతారామ స్వామి దేవాలయ జీర్ణోద్ధారణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. పదేళ్లలో నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు నిర్మించడంతో పాటు 100కు పైగా మసీదులు, చర్చిలు నిర్మించి ప్రతీ ఒక్కరిలో దైవ చింతనను పెంపొందించామని వివరించారు. భవిష్యత్‌లోనూ దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగేందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


జీర్ణోద్ధారణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పరిశుభ్రత పాటించాల్సిందే

- డీఎల్‌పీఓ అనిత

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని డీఎల్‌పీఓ అనిత సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతలను పూడ్చి వేసి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులను కడిగి శుభ్రం చేస్తుండాలన్నారు. పాత టైర్లు, పూలకుండీల్లో నిలిచే నీటితో దోమలు అధికమై ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంది పంచాయతీ కార్యదర్శికి నోటీస్

కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్‌కు డీఎల్‌పీఓ అనిత షోకాజ్ నోటీసు జారీ చేశారు. బుధవారం కందిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అపరిశుభ్ర లోపం, డంపింగ్ యార్డు నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

మాలమహానాడు ఆధ్వర్యంలో బంద్


బంద్‌లో మాల మహానాడు నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సుప్రీంకోర్టు వెంటనే ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించి రద్దు చేయాలని మాల మహానాడు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జనార్దన్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం సంగారెడ్డిలో బంద్ నిర్వహించారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలను మూసివేయించి బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. బంద్‌లో మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయరావు, సీనియర్ నాయకులు అనంతయ్య, మల్లేశం, లక్ష్మయ్య, దర్శన్ న్యాయవాది రత్నాకర్, న్యాయవాది దుర్గ ప్రసాద్, అంబేద్కర్ సంఘం అశోక్, జగన్, గోపాల్, అంజనేయులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంఘం ధర్నా

- గీత వృత్తిలోకి వేరే వారిని అనుమతించకూడదంటూ...



ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేసిన కల్లుగీతా కార్మిక సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్ : కల్లుగీత వృత్తిలోకి రెడ్డి కులస్తులను అనుమతించ కూడదని సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ మాట్లాడారు. గుమ్మడిదలలో సొసైటీ ఉన్నప్పటికీ అదే గ్రామంలో రెడ్డి కులానికి చెందిన లక్ష్మారెడ్డి తన భూమిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈత చెట్లను పెంచాడన్నారు. తద్వారా వచ్చే కల్లును అమ్ముకొని వ్యాపారం చేస్తున్నాడన్నారు. దీంతో తాము జీవనాధారం కోల్పోతామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఏఈఓ బాధ్యతల స్వీకరణ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట క్లస్టర్ ఏఈఓగా భగేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ స్థానంలో పనిచేసిన ఏఈఓ ప్రశాంత్ బదిలీపై వెళ్లారు. దీంతో భగేష్ బదిలీపై వచ్చారని ఏఓ చైతన్య తెలిపారు.

◆ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనిల్

జహీరాబాద్ టౌన్: బీజేవైఎం రాష్ట్ర కమిటీలో జహీరాబాద్ పట్టణానికి చెందిన సోమ అనిల్‌కు స్థానం దక్కింది. జహీరాబాద్ బీజేవైఎం కన్వీనర్‌గా ఉన్న ఆయన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని బీజేవైఎం పటిష్టకు కృషి చేస్తానని చెప్పారు.

◆ ఉపాధి పనులపై నేడు ప్రజావేదిక

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పనుల్లో నిర్వహించిన ఆడిట్‌పై గురువారం ఎంపీపీ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావేదికలో ఉపాధి హామీ పథకం అడిషనల్ డీఆర్‌డీఏ బాలరాజు టీం హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు పాల్గొనాలని సూచించారు.

◆ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ సింధు అధికారులను కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో సీసీ రోడ్డు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ, పైపులైన్‌కు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. డివిజన్ అభివృద్ధిలో ముందుందని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదగిరి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

◆ వైజ్ఞానిక శిక్షణ తరగతులకు రండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ సంఘం జిల్లా కార్యదర్శి మహేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయం ఎదుట శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను పట్టణంలోని ఆగస్టు 24, 25వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి సంఘం ఉద్యమాల బలోపేతానికి, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడటం కోసం జరుగుతున్న ఈ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. క్లాసులను విద్యావేత్తలు, సామాజిక వేతలు, మేధావులు బోధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు శ్రీను, నవీన్, నితిన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులపై గ్రామసభలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన పారిశుద్ధ్యం, పరిశుభ్రత, పచ్చదనానికి సంబంధించిన పనులపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని తుర్కవడ్‌గాంలో ఎంపీడీఓ సత్తయ్య పనులను పరిశీలించగా, కంగ్టిలో ఎంపీఓ సుభాష్ పనులకు పరిశీలించారు. కార్యక్రమంలో అయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు, పాల్గొన్నారు.

◆ రాయితీ రుణ ప్రక్రియను ప్రారంభించాలి

నారాయణఖేడ్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కేవీపీఎస్ రాష్ట్రకమిటీ సభ్యుడు సుభాష్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో బుధవారం నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. రాష్ట్రంలో రాయితీ రుణాలతో పాటు అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. సంఘ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు రమేశ్, సతీష్ పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సత్వార్ గ్రామానికి చెందిన చంద్రకాంత్‌కు వైద్యం నిమిత్తం రూ.40వేలు, పస్తాపూర్‌కు చెందిన గుజేరి రాములుకు రూ.50 వేల చెక్కులను జహీరాబాద్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శుక్లవర్ధన్‌రెడ్డి, అశ్విన్ పటేల్, నర్సింహయాదవ్, నాగిరెడ్డి, రాజ్‌కుమార్, నసీర్ పాల్గొన్నారు.

◆ నేటి రైతు ధర్నాకు తరలిరండి

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్ఎస్ శ్రేణులు గురువారం జరిగే రైతు ధర్నాకు తరలిరావాలని పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు చీలమల్లన్న, పెద్దగొల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాకు మాజీ ప్రజాప్రతినిధులు రైతులు, పార్టీ నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

◆ ఉచిత వైద్యశిబిరానికి స్పందన

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని సిరిపురంలో ఆయుష్ ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు సంబంధించి మధుమేహం, రక్తపోటు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మంజీరా పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ మంత్రిని కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను బుధవారం ఆమె నివాసంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు.

◆ ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. సిర్గాపూర్ మండలం తోల్యాతండాలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు శిరీష ఎలాంటి సమాచారం లేకుండా, సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి ముందస్తు అనుమతి తీసుకోకుండా పాఠశాలకు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

◆ ఎస్‌జీఎఫ్ క్రీడలపై సమావేశం

పటాన్‌చెరు: గుమ్మడిదల మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్ విద్యార్థుల ఎంపిక సమావేశాన్ని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈఓ జెమినీ కుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలకు అధికారులు పలు సూచనలు చేశారు. గ్రామంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో ఈనెల 28, 29లో అండర్ 14, 17 విద్యార్థుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు విద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రాంబాబు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పీఈటీలు, పీడీలు, సీఆర్పీలు శ్రీను పాల్గొన్నారు.

◆ రోడ్డు మరమ్మతులకు వినతి

నారాయణఖేడ్: ఖేడ్ నుంచి నాగల్‌గిద్ద మీదుగా కర్ణాటక, మహారాష్ట్రలకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు బుధవారం ఖేడ్ ఆర్అండ్‌బీ శాఖ డీఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సీపీఎం నాయకులు రమేశ్, చంద్రశేఖర్, సతీష్ తెలిపారు.

◆ ఖేడ్‌లో జ్వర సర్వే ప్రారంభం

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నుంచి జ్వర సర్వేను ప్రారంభించారు. మున్సిపాలిటీ, వైద్య సిబ్బంది 1వ వార్డుకు సంబంధించిన చాంద్‌ఖాన్‌పల్లిలో ఇంటింటికీ తిరిగి ఎవరికైనా జ్వర వివరాలు నమోదు చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సర్వేను పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులుగా దత్తురెడ్డి

నారాయణఖేడ్: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఖేడ్‌కు చెందిన దత్తురెడ్డి ఎన్నికయ్యారు. సంగారెడ్డిలోని కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన పార్టీ నిర్మాణ జిల్లాస్థాయి సమావేశంలో ఈమేరకు ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా దత్తురెడ్డి కొనసాగుతున్నారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పటాన్‌చెరు టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో యాదగిరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని నందిగామలో జరుగుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేలో గ్రామ కార్యదర్శి రాజేందర్ పాటిల్‌తో కలిసి ఎంపీడీఓ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.